క్లుప్తంగా

నేడు మాజీ ఉప రాష్ట్రపతి రాక

సీతమ్మధార: సీతమ్మధార ఎస్‌ఎఫ్‌ఎస్ స్కూల్‌లో సోమవారం నిర్వహించనున్న గోల్డెన్ జూబ్లీ క్లోజింగ్ సెలబ్రేషన్స్‌కు ముఖ్య అతిథిగా మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు విచ్చేయనున్నారని స్కూల్ ప్రిన్సిపాల్ మనోజ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు పాఠశాల వద్దకు చేరుకుని వేడుకల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

శాంతికి పునాది మత సామరస్యం

సీతంపేట: బీవీ ఫౌండేషన్ ఫర్ పీస్, ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ రిలీజియస్ సంస్థల ఆధ్వర్యంలో ఆదివారం బుల్లయ్య కళాశాల ప్రాంగణంలోని గాంధీ సెంటర్‌లో 'ప్రపంచ శాంతికి కళలు, సంస్కృతి పాత్ర' అనే అంశంపై సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ రిటైర్డ్ వీసీ ఆచార్య జార్జ్ విక్టర్ మాట్లాడుతూ మత సామరస్యం శాంతికి పునాదని, బాల్య దశలోనే విద్యార్థుల్లో శాంతి సామరస్యం ఆవశ్యకతపై అవగాహన కల్పించాలన్నారు. తద్వారా మంచి సమాజాన్ని నిర్మించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంస్థ చైర్మన్ నరవ ప్రకాశరావు, హరగోపాలరావు, హుస్సేన్, ఛాట్ల బాబూరావు, ఇ.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అనకాపల్లి స్థానాన్ని కేటాయించాలి

సీతంపేట: రానున్న ఎన్నికల్లో అనకాపల్లి లోక్‌సభ స్థానాన్ని తనకు కేటాయించాలని తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు ఆడారి కిషోర్‌కుమార్ కోరారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆదివారం జరిగిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. అనకాపల్లి పట్టణంలో తాను పుట్టి పెరిగి, చదివానన్నారు. అనకాపల్లి పార్లమెంట్ సీటు తనకు కేటాయించాలని టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు, నియోజకవర్గ నేతలను కలిసి వినతిపత్రాలు అందజేశానని తెలిపారు. అన్ని అర్హతలు ఉన్న తనకు ఒక్క ఛాన్స్ ఇస్తే అనకాపల్లి లోక్‌సభను అద్భుతంగా మారుస్తానన్నారు.

రోటరీ క్లబ్‌కు పోలియో ఫండ్



విశ్వతేజ స్కూల్ యాజమాన్యాన్ని సత్కరిస్తున్న రోటరీ క్లబ్ ప్రతినిధులు

తాటిచెట్లపాలెం: తాటిచెట్లపాలెంలోని విశ్వతేజ స్కూల్ పోలియో ఫండ్ నిమిత్తం సేకరించిన రూ.56 వేలను రోటరీ క్లబ్ విశాఖపట్నం పోర్ట్ సిటీ ప్రతినిధులకు అందజేసింది. ఈ సందర్భంగా ఆదివారం రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఆర్.వి.సుబ్బారావు, ప్రెసిడెంట్ ఆర్.రామకృష్ణలు విశ్వతేజ స్కూల్ కరెస్పాండెంట్ ఐ.భాస్కరరావు, ప్రిన్సిపాల్ ఐ.సునీతలను ఘనంగా సత్కరించారు. రోటరీ క్లబ్ సెక్రటరీ ఎస్ఎస్ఎన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

వైభవుడి క్షేత్రంలో దివ్యానుభూతి

- ఘనంగా నిత్య పూజలు.. ప్రధాన ఉత్సవాలు
- భక్తుల కోసం ఆధునిక సౌకర్యాలు
- అనతి కాలంలోనే విశేష ఆదరణ



కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వైభవ వేంకటేశ్వర స్వామి దివ్యక్షేత్రం



ప్రదక్షిణ మండపం చుట్టూ ఏర్పాటు చేసిన ఆధునిక రూఫ్ టాప్ (ఇన్‌సెట్) వైభవ వేంకటేశ్వర స్వామి

మురళీనగర్: నగరంలోనే ప్రసిద్ధి చెందిన కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామి దివ్యక్షేత్రంలో భక్తుల కోసం ఆధునిక హంగులు సమకూర్చారు. ఇవి అందరినీ ఎంతగానో ఆకర్షిస్తున్నాయి. ఆలయం స్థాపించిన అనతి కాలంలోనే దివ్యక్షేత్రంగా రూపాంతరం చెందడమే కాకుండా వైభవుడు తన దివ్య రూప దర్శనంతో భక్తుల హృదయాల్లో కొలువయ్యాడు. దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ఆలయంలో నిత్య పూజలు, ప్రధాన ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు.

2002లో ప్రారంభం

ఎన్‌జీజీవోస్ కాలనీలో ఆలయ నిర్మాణానికి 1999లో శంకుస్థాపన చేయగా.. 2002 మే 22న విగ్రహాల ప్రతిష్ట జరిగింది. ఆలయంలో మూలవిరాట్టు వైభవ వేంకటేశ్వరస్వామి విగ్రహంతోపాటు పద్మావతి, గోదాదేవి, గరుడాళ్వారు, విశ్వక్షేనుడు విగ్రహాలను కంచి నుంచి తీసుకొచ్చారు. వేంకటేశ్వర స్వామి విగ్రహాన్ని పెందుర్తి వడ్డికాసులు, గోదాదేవి విగ్రహాన్ని రామకృష్ణారెడ్డి, పద్మావతి అమ్మవారి విగ్రహాన్ని మధుమోహన్, విశ్వక్షేనుడిని వీరాస్వామి, గరుడాళ్వారును రమణరావు కుటుంబ సభ్యులు అందజేశారు.

అడుగడుగునా ఆధ్యాత్మికత..

ఆలయంలో అడుగడుగునా ఆధ్యాత్మికత ఉట్టిపడేలా ఏర్పాట్లు చేశారు. ఆలయ ప్రదక్షిణ మండపం చుట్టూ నాలుగు మూలల్లో భాగవతంలోని గజేంద్ర మోక్షం, నరసింహ స్వామి అవతారం, కాళీయమర్ధనం, శ్రీకృష్ణుడి గోవర్ధన గిరి ఘట్టాలతో విగ్రహాలను ఏర్పాటు చేశారు. ఇవి భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఇందుకోసం రూ.3 లక్షలు ఖర్చు చేశారు. ఆలయ ప్రాంగణమంతా ఖాళీ స్థలాన్ని పచ్చదనం ఉట్టిపడేలా తీర్చిదిద్దారు. గోశాలను నిర్మించి నిర్వహిస్తున్నారు.

ఆధునిక హంగులు – సౌకర్యాలు

గతంలో ఆలయ కమిటీ నిర్వహణలో ఉన్నప్పుడు ఇక్కడ మూడు భారీ ప్రాజెక్టులు చేపట్టారు.

- ఎండా, వానా కాలంలో ఆలయంలో ప్రదక్షిణకు భక్తులు ఎటువంటి ఇబ్బంది పడకుండా స్టెన్‌సెల్ ఫ్యాబ్రిక్ రూఫ్‌ను ఏర్పాటు చేశారు. ఆలయం ముఖద్వారంతోపాటు అన్ని చోట్లా దీనిని నిర్మించారు. బెల్జియం నుంచి దిగుమతి చేసుకున్న ఈ రూఫ్ టాప్ 30 ఏళ్ల పాటు మన్నుతుంది. 5500 స్క్వేర్‌ఫీట్ ఏరియాలో నిర్మించిన ఈ రూఫ్ హుద్‌హుద్ లాంటి తుపానులను సైతం తట్టుకుంటుంది. దీంతో వైభవుడి ఆలయం కొత్త అందాన్ని సంతరించుకుంది.
- ఉత్సవాల వేళలో వైభవుడిని ఊరేగించేందుకు రథాన్ని సమకూర్చారు.
- దాతల సాయంతో ఇక్కడ అన్నసమారాధన భవనం నిర్మించారు. నాలుగు అంతస్తుల్లో కట్టిన ఈ భవనంలో ఒక్కో ఫ్లోర్ 2 వేల ఎస్ఎఫ్‌టీ వైశాల్యాన్ని కలిగి ఉంది. గ్రౌండ్ ఫ్లోర్‌లో కుకింగ్, ప్రావిజన్స్‌కు, మొదటి అంతస్తు డైనింగ్(సిట్టింగ్) హాల్, రెండో ఫ్లోర్ బఫే డైనింగ్, మూడో ఫ్లోర్ వసతి, కార్యాలయం, కాన్ఫరెన్స్‌ల నిర్వహణకు వినియోగిస్తున్నారు.
- స్వామివారికి 1200 గ్రాముల స్వర్ణపాదాలను భక్తులు అందించారు. స్వర్ణంతో తయారు చేసిన అభయహస్తం, గోవిందనామం, కర్ణపత్రాలు హృదయ లక్ష్మిలు(శ్రీదేవీ, భూదేవీ) ఉన్నాయి.
- ఆన్‌లైన్ టికెట్ విధానాన్ని అమలు చేస్తున్నారు. ఆలయ ఈవో బండారు ప్రసాద్ పర్యవేక్షణలో ఉత్సవాలు, నిత్య పూజలు పకడ్బందీగా జరుగుతున్నాయి. ప్రతి శనివారం అలివేలు మంగ అన్నసత్రంలో భక్తులకు ఉచితంగా అన్నదానం చేస్తున్నారు.



ఆలయ ముఖద్వారం వద్ద విగ్రహాలు

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం



అరుంధతి నగర్‌లో పర్యటిస్తున్న వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు

47వ వార్డు పర్యటనలో కె.కె.రాజు

కంచరపాలెం: జీవీఎంసీ 47వ వార్డులో ఆదివారం నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు పర్యటించారు. కంచరపాలెం పరిధి రాంజీ ఎస్టేట్, అంబేడ్కర్ ఎస్టేట్, కప్పరాడ, అరుంధతి నగర్, బాపూజీనగర్, అల్లూరి సీతారామరాజు నగర్ కొండవాలు ప్రాంతాల్లో పాదయాత్ర చేస్తూ స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రాంజీ ఎస్టేట్‌లో ఏర్పాటు చేసిన గ్రామసభలో ఆయన పాల్గొని ప్రజల సమస్యలను వినతిపత్రాల రూపంలో స్వీకరించారు.

ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ ప్రజా సమస్యలను పరిష్కరించడంలో.. మౌలిక వసతులను కల్పించడంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుందన్నారు. ప్రజలకు అన్ని వేళలా అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వార్డు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

చదవని పుస్తకాలను డొనేట్ చేయండి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆచార్య బాలమోహన్‌దాస్ తదితరులు

సీతంపేట: సొసైటీ ఫర్ ద ప్రమోషన్ ఆఫ్ పబ్లిక్ లైబ్రరీస్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో గ్రంథాలయ గాంధీ వెలగా వెంకటప్పయ్య 9వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్మారక పురస్కారాన్ని ఉండ్రాజవరం గ్రంథపాలకుడు నున్న వెంకట రామారావుకు ఆచార్య పి.బాలమోహన్‌దాస్ చేతుల మీదుగా ప్రదానం చేశారు. సంస్థ అధ్యక్షుడు పి.ఎస్.ఎన్.మూర్తి రచించిన 'డెవలప్‌మెంట్ ఆఫ్ పబ్లిక్ లైబ్రరీస్ అండర్ సీఎస్ఆర్' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. బాలమోహన్‌దాస్ మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో పబ్లిక్ లైబ్రరీల పరిస్థితి ఇబ్బందికరంగా ఉందన్నారు. దీనికి కారణం ఫిజికల్ బుక్స్‌కు ప్రత్యామ్నాయంగా డిజిటల్, ఎలక్ట్రానిక్ బుక్స్ వచ్చాయని చెప్పారు. చేతిలో మొబైల్ ఉంటే గూగుల్ చేస్తే అన్ని పుస్తకాలు మన వద్ద ఉన్నాయన్న భావన పాఠకులు, విద్యార్థుల్లో కనిపిస్తోందన్నారు. పుస్తకాన్ని చదువుతుంటే వచ్చే ఆనందం.. మొబైల్, కంప్యూటర్స్‌లో చదివితే రాదన్నారు. కంపెనీలు తమ లాభాల్లో కొంత భాగాన్ని సీఎస్ఆర్ కింద పబ్లిక్ లైబ్రరీల అభివృద్ధికి ఇచ్చేలా సొసైటీ ఫర్ ద ప్రమోషన్ ఆఫ్ పబ్లిక్ లైబ్రరీస్ సంస్థ కృషి చేసిందని కొనియాడారు. విశాఖ పౌర గ్రంథాలయం అభివృద్ధే దీనికి నిదర్శనమన్నారు. చాలా మంది వద్ద పుస్తకాలు చదవకుండా ఉన్నాయని, వాటిని ప్రజలకు ఇచ్చేలా బుక్ డొనేషన్ క్యాంపెయిన్ నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో వెలగా ర్వోత్తమరావు, ఎం.కోటేశ్వరరావు, సాంబశివరావు, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఫోర్త్‌టౌన్ సీఐ విజయకుమార్



రౌడీషీటర్లకు సూచనలిస్తున్న ద్వారకా ఎస్ఐ శ్రీను

సీతమ్మధార: ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం రౌడీషీటర్లు, పాత నేరస్తులకు సీఐ విజయకుమార్ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎటువంటి నేరాలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని యాక్టివ్‌గా ఉన్న రౌడీలను హెచ్చరించారు. రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో నడుచుకుంటున్నారా.. లేదా అని అడిగి తెలుసుకున్నారు. తగాదాలు, కొట్లాటల్లో తలదూర్చకుండా కుటుంబ సభ్యులతో కలిసి హాయిగా జీవించాలని సూచించారు. పోలీస్ నిఘా ఎల్లప్పుడూ ఉంటుందని గుర్తుంచుకుని మంచిగా నడుచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ వెంకటరావు, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

ద్వారకా పీఎస్‌లో..

ద్వారకా పోలీస్ స్టేషన్‌లో రౌడీషీటర్లకు ఎస్ఐ శ్రీను కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడికి వెళ్లినా పోలీస్ స్టేషన్‌లో సమాచారమివ్వాలని వారితో అన్నారు. మీరు నివసించే ప్రాంతాల్లో అల్లర్లు సృష్టిస్తే చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

మద్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం రౌడీషీటర్లకు సీఐ ఎస్.భాస్కరరావు ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ఉండాలని వారికి సీఐ సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



కంచరపాలెం పీఎస్‌లో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ చేస్తున్న సీఐ భాస్కరరావు

ఐదుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

రూ.34,700 నగదు స్వాధీనం

సీతమ్మధార: ఓ అపార్ట్‌మెంట్ ఫ్లాట్‌లో గుట్టుచప్పుడు కాకుండా పేకాట ఆడుతున్న ఐదుగురిని ఫోర్త్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారు తెలిపిన వివరాలిలా.. జీవీఎంసీ 27వ వార్డు దొండపర్తి సుబ్బలక్ష్మీనగర్‌లోని అపార్ట్‌మెంట్‌లో గల ఒక ఫ్లాట్‌లో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో ఫోర్త్‌టౌన్ పోలీసులు సోదాలు నిర్వహించారు. అక్కడ పేకాటాడుతున్న కంచరపాలెం ఇందిరానగర్‌కు చెందిన కడగల రామకృష్ణ, గాజువాక కర్ణవానిపాలేనికి చెందిన ఎస్.భీమరాజు, తాటిచెట్లపాలెం ఆంజనేయ స్వామి ఆలయం వెనుక వీధికి చెందిన వేకి శ్రీనివాసరావు, కంచరపాలెం గజపతి నగర్‌కు చెందిన బోరులపల్లి శ్రీనివాసరావు, దొండపర్తి సుబ్బలక్ష్మీనగర్‌కు చెందిన రఘుమండ మోహన్‌రావులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి రూ.34,700 నగదు స్వాధీనం చేసుకున్నారు.

నాలుగు కిలోల గంజాయి పట్టివేత

సీతమ్మధార: నగర కమిషనర్ డా.రవిశంకర్, అడిషనల్ కమిషనర్ వెంకటరావు(స్పెషల్ బ్రాంచ్) ఆదేశాల మేరకు గుట్టుచప్పుడు కాకుండా అక్రమంగా గంజాయి తరలిస్తున్న యువకుడిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివరాలిలా.. ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రైల్వేస్టేషన్ మొయిన్ గేటు వద్ద అల్లూరి సీతారామరాజు జిల్లా అట్లగూన గ్రామం అరకుకు చెందిన పంగి గోపినాథ్ అనే యువకుడు అరకు నుంచి బెంగుళూరుకు గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్నాడని సమాచారంతో టాస్క్‌ఫోర్స్ ఏసీపీ ఆదేశాల మేరకు ఎస్ఐ భరత్‌కుమార్ సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకున్నారు. యువకుడు అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకుని విచారించగా.. నాలుగు కిలోల గంజాయి, ఒక సెల్‌ఫోన్ ఉన్నట్లు గుర్తించి ఫోర్త్‌టౌన్ పోలీసులకు అప్పగించారు. ఫోర్త్‌టౌన్ సీఐ విజయకుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నాయకత్వ లక్షణాలతో సమర్థవంతమైన సేవలు

అల్లిపురం: సమాజానికి సేవ చేసే సంస్థల యజమానులు, సభ్యులు నాయకత్వ లక్షణాలతోపాటు అన్ని అంశాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని జోన్-4 జేసీఐ మెంటార్ కె.వి.రావు సూచించారు. జేసీఐ వాల్తేరు, జేసీఐ విశాఖ మెట్రో, జేసీఐ వైజాగ్ అచీవర్స్ సంయుక్తంగా ఆదివారం నగరంలో రాక్‌డేల్ హోటల్‌లో సమర్థవంతమైన ప్రజా ప్రసంగ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించాయి.ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంతోపాటు ఇతర సమస్యలపై అవగాహన కలిగి ఉంటే సత్వరమే పరిష్కారానికి అవకాశం ఉంటుందన్నారు.

కుర్తాళం పీఠాధిపతికి ఘన స్వాగతం



సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామికి స్వాగతం పలుకుతున్న భక్తులు

సీతంపేట: అమృతోత్సవం పేరిట నిర్వహిస్తున్న శ్రీలలితా పీఠం 75వ వార్షికోత్సవంలో పాల్గొనేందుకు కుర్తాళం పీఠాధిపతి, జగద్గురు సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి ఆదివారం అక్కయ్యపాలెం లలితానగర్‌లోని లలితా పీఠానికి వచ్చారు. కుర్తాళం నుంచి వచ్చిన స్వామీజీ, శక్తి పీఠాధీశ్వరి రామ్యానంద భారతీ స్వామినిలకు పీఠం వేద పండితులు, అర్చకులు పూర్ణకుంభం, మేళతాళాలతో ఘన స్వాగతం పలికారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారికి దారి పొడుగునా పూలతో ఆహ్వానించారు. ఈ నెల 19 నుంచి 24 వరకు పీఠాధిపతి సమక్షంలో అమృతోత్సవాలు జరుగుతాయని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు.

పద్య, గేయ రచయితలకు సత్కారం



రచయితలను సత్కరిస్తున్న ఆచార్య బేతవోలు, డాక్టర్ రఘురామారావు

సీతంపేట: ఇటీవల తానా నిర్వహించిన పద్య, గేయ కావ్యాల పోటీల్లో విజేతలకు సత్కార కార్యక్రమం విశాఖ రసజ్ఞ వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ గండికోట రఘురామారావు అధ్యక్షతన ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆదివారం ఘనంగా జరిగింది. మొదటి స్థానం గెలుపొందిన పద్యకావ్యం 'జీవన వాహిని' రచయిత బులుసు వెంకటేశ్వర్లు, 'యువావతరణము' గేయ కవిత్వాన్ని రచించిన రాంభట్ల నృసింహశర్మ, 'సామాజిక త్రిశతి' శతక కర్త సిహెచ్.చిన సూర్యనారాయణలను ముఖ్య అతిథి ఆచార్య బేతవోలు రామబ్రహ్మం చేతుల మీదుగా దుశ్శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా బేతవోలు మాట్లాడుతూ తానా సంస్థ చేస్తున్న సాహిత్య సేవ ప్రశంసనీయమని, ఇటీవల పుస్తక ప్రచురణ కూడా పెద్ద ఎత్తున చేపట్టిందన్నారు. సిరివెన్నెల సీతారామశాస్త్రి రచనలను నాలుగు సంపుటాల్లో ప్రచురించిందని గుర్తుచేశారు. సమాజానికి మేలుచేసే ఆధునిక ఇతివృత్తంతో తానా నిర్వహించిన పద్య, గేయ రచనల్లో విశాఖకు చెందిన ముగ్గురు రచయితలు చేసిన రచనలు ఉత్తమమైనవిగా ఎంపిక కావడం అభినందనీయమన్నారు. జీవన వాహిని పద్య కావ్యం రచయిత అద్భుతమైన పద్య రచనా శైలిని ఆద్యంతం ప్రతిబింబిస్తుందన్నారు. భారతీయ జీవన విధానంలో వచ్చిన మార్పులపై అలవోకగా అనుప్రాసలతో యువావతరణము గేయ కావ్యం ఆకట్టుకుందన్నారు. డాక్టర్ రఘురామారావు మాట్లాడుతూ అద్భుత రచనలు చేసిన ముగ్గురు పండితులను సత్కరించే అవకాశం విశాఖ రసజ్ఞ వేదికకు రావడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో అరసం అధ్యక్షుడు ఉప్పల అప్పలరాజు, పలువురు రచయితలు, సాహితీవేత్తలు పాల్గొన్నారు.

ఘనంగా బల్లల పండగ



కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణను సన్మానిస్తున్న రజకుల సంఘం నాయకులు

మద్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డు వాంబే కాలనీలో శ్రీకనకదుర్గా రజకుల సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం బల్లల పండగ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ రజకులకు పండగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో స్థానికులు విశ్వనాథరాజు, శ్యామ్, చిన్ని, భాను, వాంబే కాలనీ మహిళా రజక సంఘం కమిటీ నాయకులు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా ఎరుకుమాంబ విగ్రహ ప్రతిష్ట



అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్



దొండపర్తిలో ఉత్సవ విగ్రహాలు ఊరేగిస్తున్న భక్తులు

సీతమ్మధార: దొండపర్తిలో వెలసిన ఎరుకుమాంబ అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు అంగరంగ వైభవంగా జరిగాయి. ప్రధాన అర్చకుడు గంగవరపు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఉదయం గణపతి పూజ, పుణ్యాహవచనం, పూర్ణహుతి(హోమం) నిర్వహించారు. 108 కలశాలతో భక్తులు అమ్మవారికి జలాభిషేకం చేశారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ నీలాపు సర్వేశ్వర రెడ్డి, ఈవో జి.రమాబాయి ఆధ్వర్యంలో సాయంత్రం ఊరేగింపు అనంతరం అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల మధ్య ఈ కార్యక్రమాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. ముందుగా ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. అమ్మవారి విగ్రహ దాతలు రాపర్తి శివసాయి,'ససంగీత దంపతులు, అన్నదాన దాత సీహెచ్ సత్యం, ధర్మకర్తలు పిల్లి స్వాతి, పి.లక్ష్మీనారాయణమ్మ, పిల్లి దుర్గ, దళాయి అన్నపూర్ణ, పెద్దాడ రమణమ్మ, బంటుపల్లి సూర్యనారాయణ, కె.బ్రహ్మాజీ, శరగడం నర్సింగరావు, సిబ్బంది సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

బౌద్ధ సమ్మేళనం విజయవంతానికి పిలుపు

పెదగంట్యాడ: ఈ నెల 25న ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకూ రామాటాకీస్ రోడ్డులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవనంలో నిర్వహించనున్న 11వ బౌద్ధ మహా సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం ఆయన బౌద్ధ సమ్మేళనం పోస్టర్‌ను ఆవిష్కరించారు. దేశ వ్యాప్తంగా ఉన్న బౌద్ధ భిక్షువులు తరలి రానున్నారని, ఈ సందర్భంగా బౌద్ధ దమ్మ జ్యోతి ర్యాలీ, దమ్మ దీక్ష, దమ్మ మహాసభ, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి బోర వేణుగోపాల్ గౌతమ్, జిల్లా జాయింట్ సెక్రటరీ పెయ్యిల సిద్ధార్థ తెలిపారు. కార్యక్రమంలో గొందేశి శ్రీనివాస్‌రెడ్డి, లోకనాథం తదితరులు పాల్గొన్నారు.

భారత సంస్కృతి, నాగరికతపై అవగాహన అవసరం

ఎంవీపీ కాలనీ: పాశ్చాత్య దేశాలు విశ్వసిస్తున్న భారతదేశ సంస్కృతి, నాగరికతపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పండిట్ వామదేవ శాస్త్రి సూచించారు. శివానంద సుపథ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'రీకన్‌స్ట్రక్టింగ్ ది కల్చరల్ హిస్టరీ ఆఫ్ భారత' అనే అంశంపై రెండు రోజుల సింపోజియంను ఎంవీపీ కాలనీలోని ఐఏఎం వేదికగా ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధి పండిట్ వామదేవ శాస్త్రి మాట్లాడుతూ భారతదేశం గొప్ప, సజీవమైన నాగరికతను కలిగి ఉందన్నారు. చాలా మంది పాశ్చాత్య చరిత్రకారులు భారత సంస్కృతిని వక్రీకరించి రాశారన్నారు. ఈ నేపథ్యంలో భారత ప్రాచీన చరిత్ర మూలాలను, నాగరికతను ప్రతి ఒక్కరూ తెలుసుకోవడంతోపాటు ప్రపంచానికి అందించాలని పిలుపునిచ్చారు. సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాధాకుమారి మాట్లాడుతూ భారత చరిత్రకారులు రాసిన మనదేశ చరిత్ర కొంత మేర వెలుగులోకి రాలేదన్నారు. ఈ నేపథ్యంలో శివానంద సుపథ ఫౌండేషన్ ద్వారా ప్రాచీన భారత చరిత్రను నేటితరానికి వెలుగులోకి తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. నేటి చరిత్రకారులు రాసిన పుస్తకాలను ప్రచురించడం, సదస్సుల ద్వారా చారిత్రక ఆధారాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం జరుగుతుందన్నారు. పండిట్ వామదేవ శాస్త్రిని నిర్వాహకులు సత్కరించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు ఆచార్య సుదర్శనరావు, ఆచార్య ఆర్.రాఘవేంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

IN THE HON'BLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT: VISAKHAPATNAM
S.O.P.8/2024

Between:
Neralla Surya Brahmaji Rao,
S/o. late Venkata Surya Narayana, R/at Flat No.102, 1st Floor, Maurya Sadan Apartment, Madhavadhara, Visakhapatnam-07 ...Petitioner
And
The Branch Manager,
State Bank of India, Madhavadhara Branch, Visakhapatnam. ...Respondent

GENERAL NOTICE

The public in general are hereby informed that the above named petitioner filed the above petition to issue Succession Certificate in favour of the petitioner enabling them to transfer the schedule mentioned amount in the name of the petitioner which stands in the name of the deceased late Neralla Narasinga Rao, S/o. late Suryanarayana who died on 11-11-2022. The above matter stands posted to **26-02-2024**. Therefore, the public in general are hereby informed that if anyone having objections in the above matter, please appear before the Hon'ble Court on **26-02-2024** at **10:30 A.M.** and intimate the objections, failing which the matter will be decided exparte in your absence.

(By Order of the Hon'ble Court)
KAMSU PRABHAKAR, Advocate
Visakhapatnam-08, Cell: 9848338408.